# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 74 EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 14 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 74, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 14 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-


## మీడియాపై మోహన్ బాబు చిందులు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

సినీ నటుడు డాక్టర్ మంచు మోహన్ బాబు మీడియాపై అసహనం వ్యక్తం చేశారు. ఓ ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం ఆయన హైదరాబాద్ శివారులోని షాద్ నగర్ కు వచ్చారు. అక్కడి సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు తన అనుచరులతో కలిసి మోహన్ బాబు వచ్చారు. అయితే మోహన్ బాబు

మిగతా 2లో...

### ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలిగా

## దగ్గుబాటి పురందేశ్వరి



విజయవాడ- ప్రభాత సూర్యుడు

ఆంధ్రప్రదేశ్ బీజేపీ నూతన అధ్యక్షురాలిగా కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన పురందేశ్వరికి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజుతో పాటు పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరిస్తోందని చెప్పారు. అయితే బీజేపీపై

మిగతా 2లో...



# ఫ్రీ కరెంట్.. పేటెంట్ ఫైట్

- ఉచిత విద్యుత్ పై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వార్
- బీఆర్ఎస్ పవర్ రాజకీయం
- రైతులు, మహిళలు, యువతే లక్ష్యంగా కాంగ్రెస్ మేనిఫెస్టో
- 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చినట్లు రుజువుచేస్తే పదవికి రాజీనామా చేస్తా : ఎంపీ కోమటిరెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఉచిత విద్యుత్ పై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వార్ నడుస్తోంది. కాంగ్రెస్ కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ ఉచిత విద్యుత్ పై రేవంత్ వ్యాఖ్యలు వక్రీకరించి రాద్ధాంతం చేస్తుందని కాంగ్రెస్ ఆరోపిస్తుంది. తెలంగాణలో ఉచిత విద్యుత్ పై మాటల యుద్ధం జరుగుతోంది. అయితే ఉచిత విద్యుత్ స్టార్ట్ చేసిందే కాంగ్రెస్ అంటున్నారు ఆ పార్టీ నేతలు. తెలంగాణలో కాంగ్రెస్ జోరు పెరుగుతున్న వేళ బీఆర్ఎస్ పవర్ రాజకీయం మొదలు పెట్టిందని ఆ పార్టీలు నేతలు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి, కాంగ్రెస్ కు ఉచిత విద్యుత్ రద్దు అంటుందంటూ బీఆర్ఎస్ ఆగమాగం చేస్తుందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదలైన ఉచిత విద్యుత్ నే కేసీఆర్ కొనసాగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రారంభించిన ఉచిత విద్యుత్ ను తన పథకాల లాగా రద్దు చేసే ధైర్యం చేయలేకపోయారంటున్నారు. ఉచిత విద్యుత్ విషయంగా బీఆర్ఎస్ అవసర రాద్ధాంం చేస్తుందని కాంగ్రెస్ నేతలు బదులిస్తున్నారు.కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణ కాంగ్రెస్ లో జోష్ పెరిగింది. పార్టీలోకి ఇతర పార్టీల నేతలు క్యూకట్టారు. తెలంగాణలో కాంగ్రెస్ జోరుకు అడ్డుకట్టవేసేందుకు బీఆర్ఎస్ ఉచిత విద్యుత్ పై రాద్ధాంతం చేస్తుందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రేవంత్ రెడ్డి అమెరికాలో చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి... కట్ పేస్ట్ నైపుణ్యంతో ఒక వీడియో బయటకు తీసుకొచ్చారని మండిపడుతోంది. రైతులకు ఉచిత విద్యుత్ కు కాంగ్రెస్ వ్యతిరేకమనే ప్రచారం తెర మీదకు తెచ్చి.. పార్టీ నేతలంతా రోడ్డు మీదకు రావాలని బీఆర్ఎస్ పిలుపునిచ్చిందన్నారు. కాంగ్రెస్ కు ప్రజల్లో మద్దతు పెరుగుతున్న వేళ రాజకీయంగా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ఇలా అసత్యాలు ప్రచారం

మిగతా 2లో...

### ఉగ్రరూపం దాల్చిన యమునానది

### ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

## నివాసానికి వరద నీరు



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

యమునా నది ఉగ్రరూపం దాల్చింది. గురువారం ఉదయం 7 గంటలకు వరద ఉధ్ధృతి వల్ల ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ నివాసానికి 500 మీటర్ల దూరంలో వరద నీరు

మిగతా 2లో...

### మౌలిక సదుపాయాల కల్పనతోనే

## ఉపాధి, ఉద్యోగ అవకాశాలు

### కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి

తిరుపతి- ప్రభాత సూర్యుడు



శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం నా అదృష్టం, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక ప్రదేశం తిరుపతికి దేశ విదేశాలనుండి భక్తులు వస్తుంటారు, అంతర్జాతీయ ప్రమాణాలు గల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత నివ్వడం జరిగిందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. గురువారం ఉదయం స్థానిక ఎస్ వి యునివర్సిటీ స్టేడియంలో రాష్ట్రంలో కొత్తగా 3 జాతీయ రహదారులకు

మిగతా 2లో...

### ఢిల్లీని

## ముంచెత్తుతున్న వరదలు



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

ఢిల్లీలో వర్షాలు దంచి కొడుతున్నాయి. వరద పోటుకు యమునా ఉగ్రరూపం దాల్చింది. నీటి మట్టం గంట గంటకు పెరుగుతోంది. 45 ఏళ్ల తర్వాత నది నీటిమట్టం 208.30 మీటర్లు దాటింది. వరద పరిస్థితుల దృష్ట్యా ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్తమైంది.కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి) పోర్టల్ ప్రకారం పాత రైల్వే వంతెన వద్ద నీటిమట్టం ఉదయం మొదటిసారి 207 మీటర్ల మార్కును దాటింది.

మిగతా 2లో...

### అది నిరూపిస్తే ఎంపీ పదవికి

## రాజీనామా చేస్తా

### మంత్రి కేటీఆర్‌కు ఎంపీ కోమటిరెడ్డి సవాల్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ తెలంగాణలో రాజకీయ మంటలు రేపుతున్నాయి. చలి వాతావరణంలోనూ శగలు పుట్టిస్తున్నాయి. రేవంత్ వ్యాఖ్యలపై అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలు భగ్గమంటుండగా.. కాంగ్రెస్ నేతలు సైతం అంతే ధీటుగా స్పందిస్తున్నారురైతులకు ఉచిత విద్యుత్ సరఫరాపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ తెలంగాణలో రాజకీయ మంటలు రేపుతున్నాయి. చలి వాతావరణంలోనూ శగలు పుట్టిస్తున్నాయి. రేవంత్ వ్యాఖ్యలపై

మిగతా 2లో...

### నాడు విద్యుత్ ఉద్యమంలో

## రైతులను చంపిన పాపం కేసీఆర్ దే

### కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఉచిత విద్యుత్‌పై రాష్ట్రంలో తీవ్ర రచ్చ జరుగుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు తన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చిన రేవంత్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ఊర్లో పెళ్లికి కుక్కల సందడిలాగా పుట్టలో పడుకున్న పాములు బయటకి వచ్చి తనను నిందిస్తున్నారని మండిపడ్డారు. అమెరికాలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో కొందరు నిపుణులు తెలంగాణ ప్రభుత్వ పాలసీలపై ప్రశ్నలు సంధించారని... కాంగ్రెస్ పార్టీ విధివిధానాలు తాను క్లియర్‌గా వివరించినట్లు చెప్పారు. తాను చెప్పిన సమాధానంలో కొంత భాగాన్ని కట్ చేసి ప్రచారం చేశారని ఆరోపించారు. ఐటీ మంత్రి అతి తెలివి ప్రదర్శించి చిల్లర వ్యవహారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్‌పై మరోసారి చర్చ జరగడం మంచిదే అని అన్నారు. 2004 ఎన్నికల మేనిఫెస్టోలో ఉచిత విద్యుత్ అంశాన్ని

మిగతా 2లో...

### ఏపీ విద్యార్థులకు తెలంగాణలో

## రిజర్వేషన్లు ఎందుకు?

### ప్రశ్నించిన హైకోర్టు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలోని మెడికల్ కాలేజీల్లో ఏపీ విద్యార్థులు ఎలా రిజర్వేషన్లు కోరుతారని హైకోర్టు ప్రశ్నించింది. కాంపిటేటివ్ ఆథారిటీ కోటాలో ఏపీ విద్యార్థులకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వాలన్న సందేహాన్ని లేవనెత్తింది. కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని 100% సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3న జారీచేసిన 72 జీవోకు వ్యతిరేకంగా ఇద్దరు ఏపీ

మిగతా 2లో...

# ఢిల్లీని ముంచెత్తుతున్న వరదలు

(మొదటిపేజీ తరువాయి)

సాయంత్రం రికార్డు స్థాయిలో 208 మీటర్లకు చేరింది. రాత్రి 8 గంటలకు 208.30 మీటర్లకు పైగా పెరిగింది. పాత రైల్వే బ్రిడ్జిపై రాత్రి 10 గంటలకు అత్యధిక నీటి మట్టంతో కొత్త రికార్డు నమోదైందని ప్రభుత్వం తెలిపింది. 1978లో యమునా నది నీటిమట్టం 207.49 మీటర్లకు చేరింది. యమునా నది నీటిమట్టం క్రమంగా పెరుగుతుం డటంతో నది వెంబడి పలు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. దీంతో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారుబోట్ క్లబ్‌కు చెందిన 17 బోట్లు, ఇరిగేషన్ అండ్ ఫ్లడ్ కంట్రోల్ డిపార్ట్ మెంట్ కు చెందిన 28 బోట్లను సహాయక చర్యల కోసం విధుల్లో ఉంచినట్లు ఢిల్లీ ప్రభుత్వం తెలిపింది. మొత్తం 45 బోట్లను దించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన 12 బృందాలను రంగంలోకి దిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలలను గురువారం మూసివేయాలని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) విద్యాశాఖ నిర్ణయించింది.ఢిల్లీలో వరద పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సివిల్ లైన్స్ జోన్ లోని లోతట్టు ప్రాంతాల్లోని 10 పాఠశాలలు, షహదారా సౌత్ జోన్ లోని ఆరు పాఠశాలలు, షహదారా నార్త్ జోన్ లోని ఒక పాఠశాలను మూసివేయాలని ఎంసీడీ విద్యాశాఖ నిర్ణయించింది. ఈ పాఠశాలల విద్యార్థులకు ఆన్లైన్ క్లాసులు నిర్వహించనున్నారు.. ఢిల్లీ ప్రభుత్వం నది కరకట్టలను బలోపేతం చేస్తోందని, వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను ఖాళీ చేయిస్తోందని రెవెన్యూ మంత్రి అతిషి చెప్పారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, లోతట్టు ప్రాంతాలకు వెళ్లొద్దని ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ హెచ్చరికలు జారీ చేసింది.యమునా నదిలో వరద పరిస్థితి కారణంగా ప్రజలు విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ నంబర్ 1077ను సంప్రదించాలని అథారిటీ జారీ చేసిన సలహాలో పేర్కొంది. యమునా నది నీటి మట్టం రాత్రి 206 మీటర్ల మార్కును దాటింది, వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. రోడ్డు అండ్ రైలు రాకపోకల కోసం పాత రైల్వే వంతెనను మూసివేశారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఢిల్లీ జలవనరుల శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మీడియాకు తెలిపారు. పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఢిల్లీలో యమునా నది నీటిమట్టం అనూహ్యంగా పెరగడానికి పూడిక పేరుకు పోవడం, నదీ గర్భం పెరగడమే కారణమని దక్షిణాసియా నెట్ వర్క్ ఆన్ డ్యామ్స్, రివర్స్, పీపుల్ (ఎస్ఏఎన్ఆర్పీ) అసిస్టెంట్ కోఆర్డినేటర్ భీమ్ సింగ్ రావత్ తెలిపారు. వజీరాబాద్ నుంచి ఓఖ్లా వరకు 22 కిలోమీటర్ల పొడవునా పూడికతీత, 20కి పైగా వంతెనలు, మూడు బ్యారేజీలు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయి.ఎగువ పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నదిలో నీటిమట్టం పెరిగింది. వాయవ్య భారతంలో వారాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి.

## ఉగ్రరూపం దాల్చిన యమునానది

### ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

# నివాసానికి వరద నీరు

(మొదటిపేజీ తరువాయి)

ప్రవహిస్తోంది. హర్యానాలోని ఓ బ్యారేజి నుంచి నీటిని యమునా నదిలోకి విడుదల చేయడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది.గురువారం ఉదయం 7 గంటలకు యమునా నదిలో నీటి మట్టం 208.46 మీటర్లకు చేరింది. ఇది ప్రమాద స్థాయి కన్నా మూడు మీటర్లు ఎక్కువ. హర్యానాలోని హత్నికుండ్ జలాశయం నుంచి నీటిని యమునా నదిలోకి విడుదల చేస్తుండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ బ్యారేజి నుంచి నీటిని విడుదల చేయకుండా చర్యలు తీసుకోవాలని కేజ్రీవాల్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనిపై కేంద్రం స్పందిస్తూ, బ్యారేజ్‌లో మితిమీరి ఉన్న నీటిని విడుదల చేయవలసి ఉంటుందని చెప్పింది. భారీ వర్షాల వల్ల హిమాచల్ ప్రదేశ్‌లో విపరీతమైన విధ్వంసం జరిగింది. అక్కడి నుంచి నీరు ఈ బ్యారేజ్‌లోకి వస్తోంది. ఢిల్లీలోని సివిల్ లైన్స్ ఏరియాలో రింగ్ రోడ్డు వరదలో చిక్కుకుంది. మజ్ను కా తిల-కశ్మీరీ గేట్ ఐఎస్‌బీటీ మార్గాన్ని మూసివేశారు. ఇక్కడి నుంచి దాదాపు 500 మీటర్ల దూరంలో కేజ్రీవాల్ నివాసం, ఢిల్లీ శాసన సభ ఉన్నాయి. హర్యానాలోని బ్యారేజ్ నుంచి నీటి ప్రవాహం గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి తగ్గే అవకాశం ఉందని కేంద్ర జల కమిషన్ తెలిపింది. పాత ఢిల్లీ వరద ప్రభావిత ప్రాంతం కావడంతో నిగంబోధ్ ఘాట్ శ్మశాన వాటికను ఉపయోగించవద్దని అధికారులు హెచ్చరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 12 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సేవలందిస్తున్నాయి.ఢిల్లీ నగరంలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు లేవు. అయితే యమునా నదిలోకి హర్యానా నుంచి నీటిని విడుదల చేస్తుండటం వల్ల పరిస్థితి ఆందోళన కరంగా మారింది. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. యమునా నదిలో నీరు ఆల్ టైమ్ హైలో ఉంది.వజీరాబాద్‌లోని సిగ్నేచర్ బ్రిడ్జ్ సమీపంలో, గర్హి మండు గ్రామం వరద నీటిలో మునిగిపోయింది. ఐటీఓ, కశ్మీరీ గేట్, జీటీ కర్నాల్ రోడ్, బోట్ క్లబ్, మోనాస్టరీ మార్కెట్, నీలి ఛత్రి టెంపుల్, యమునా బజార్, నీమ్ కరోలీ గోశాల, విశ్వకర్మ కాలనీ, న్యూ ఉస్మాన్‌పూర్ తదితర ప్రాంతాల్లో నీరు చేరింది.

# ఫ్రీ కరెంట్... పేటెంట్ ఫైట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించిందని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ముఖ్య నేతలు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మధు యాష్కీ గౌడ్, పొన్నం ప్రభాకర్ లాంటి వారు బీఆర్ఎస్ నేతలకు కౌంటర్ ఇచ్చారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చినట్లు రుజువుచేస్తే తన ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని ఎంపీ కోమటిరెడ్డి సవాల్ చేశారు.ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ప్రారంభించిందే కాంగ్రెస్ అని పార్టీ నేతలు తెలిపారు. 2004 ఎన్నికల సమయంలో అప్పటి సీఎం చంద్రబాబు ఉచిత విద్యుత్ సాధ్యం కాదని, అదే చేస్తే రైతులు కరెంట్ తీగల మీద బట్టలు ఆరేసుకోవాలని వ్యాఖ్యానించారు. దీనికి కౌంటర్ గా అప్పటి సీఎల్పీ నేత వైఎస్సార్ తన పాదయాత్రలో ఉచిత విద్యుత్ హామీ ఇచ్చారు. రైతులు కాంగ్రెస్ నేతగా వైఎస్సార్ ఇచ్చిన హామీని నమ్మారు. అప్పటి ఎన్నికల్లో కాంగ్రెస్ కు పట్టం కట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి కాంగ్రెస్ ఉచిత విద్యుత్ హామీని అమలుచేసింది. అప్పటి నుంచి రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అమలు ప్రారంభం అయిందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఆ తరువాత రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ కు నిర్ణయం కూడా అమలుచేశామన్నారు.రైతులు, మహిళలు, యువతే లక్ష్యంగా కాంగ్రెస్ మేనిఫెస్టో సిద్ధం అవుతుందని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క అన్నారు. దీనిని పసిగట్టిన బీఆర్ఎస్ ఏం చేయాలో తెలియక, అంతు చిక్కని పరిస్థితుల్లో దుష్ప్రచారాన్ని ప్రారంభించిందన్నారు. రైతులకు ఇంకా ఎంత మేలు చేయాలని నిరంతరం ఆలోచించే పార్టీ అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ సమయాన్ని తగ్గించాలనే ఆలోచన తమకు లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ కచ్చితంగా రైతు పక్షపాత పార్టీగా..అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి వారికి మేలు చేసే నిర్ణయాల దిశగానే అడుగులు వేస్తామని భట్టి స్పష్టం చేశారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ బడ్జెట్ కేటాయింపుల్లో రైతులకు రెట్టింపు కేటాయింపులు..డబుల్ ఆదాయం వచ్చేలా నిర్ణయాలు ఉంటాయని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

## మౌలిక సదుపాయాల కల్పనతోనే

# ఉపాధి, ఉద్యోగ అవకాశాలు

(మొదటిపేజీ తరువాయి)

శంఖుస్థాపన కార్యక్రమంలో కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర మంత్రి కృష్ణ పట్నం పోర్టు కు కనెక్టివిటీ ప్యాకేజ్ 2,3,4 జాతీయ రహదారుల నిర్మాణానికి డిజిటల్ విధానంలో శంఖుస్థాపన చేసి ప్రసంగించారు. 2014 లో మంత్రిగా భాద్యతలు చేపట్టిన నాటికి ఆంధ్ర ప్రదేశ్ లో 4193 కిమీ జాతీయ రహదారులు వుంటే, అది నేడు 2023 నాటికీ 8744 కిమీ లకు చేరి దాదాపు రెండింతల నిర్మాణాలు జరిగాయని అన్నారు. మౌలిక సదుపాయలతోనే నిరుద్యోగ నిర్మూలన చేయగలం అని నమ్మిన మన ప్రధాని నరేంద్ర మోడీ నీరు, విద్యుత్, రహదారులు, కమ్యునికేషన్ వంటి వాటికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. ప్రరిశ్రమల స్థాపనకు ఈ మౌలిక సదుపాయాలు లేకుంటే పారిశ్రామిక పెట్టుబడులు రాక నిరుద్యోగ సమస్యను తీర్చలేమని అన్నారు. పోర్ట్ లకు ప్రాముఖ్యత కలిగిన ఆంధ్ర ప్రదేశ్ కు దేశంలోనే ప్రముఖ పోర్ట్ గా ప్రసిద్ధి గాంచిన విశాఖపట్నం వుందని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరో 3 పోర్ట్ ల ఏర్పాటుకు ఆసక్తి కనబరిచిందని సంతోషం అని అన్నారు. పోర్ట్ లు దేశాభివృద్ధికి తోడ్పతాయని అన్నారు. 2023 నాటికి 91 వివిధ ప్రాజెక్టులు 3240 కిమీ రూ.50 వేల కోట్లతో పూర్తీ చేస్తున్నామని మరో రూ.75 వేల కోట్లతో 190 ప్రాజెక్టులు పలు దశల్లో వున్నాయని, త్వరలో పూర్తి కానున్నాయని అన్నారు. రూ 20 వేల కోట్లతో 25 ప్రాజెక్టులు 800 కిమీ , రూ.50 వేల కోట్లతో 45 ప్రాజెక్టులు 1800 కిమీ ఏర్పాటు కానున్నాయని అన్నారు. ప్రత్యేకంగా 19 వేల కోట్లతో 430 కిమీ పోర్ట్ ల అనుసంధాన పనులు జరుగుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో దాదాపు రూ. 2 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని విదేశీ , దేశీయ పెట్టుబడులతో ప్రరిశ్రమల స్థాపనకు మొగ్గ చూపుతున్నారని దీనికి రవాణా సౌకర్యం కారణమని అన్నారు. ఒక్క తిరుపతి జిల్లాలోనే రూ. 17 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయని 2024 నాటికీ పూర్తీ కానున్నాయని, జిల్లా ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు. ఇప్పటికే రూ.4 వేల కోట్లతో పనులు పూర్తీ అయ్యాయని, మరో రూ.13 వేల కోట్లతో జరుగుతున్న కడప ? రేణిగుంట , తిరుపతి ? మదనపల్లి , రేణిగుంట ? నాయుడుపేట 6 లేన్ వంటి రహదారులు 2025 నాటికి పూర్తీ కానున్నాయని అన్నారు. కృష్ణపట్నం పోర్ట్ సమీపంలో నాయుడుపేట – తూర్పు కనుపూరు 6 లేన్ల రహదారి 35 కి.మీ రూ.1399 కోట్లు, చిల్లకూరు క్రాస్ నుండి తూర్పు కాన్పూర్ వరకు 4 లేన్ల రహదారి మరియు తూర్పు కాన్పూర్ నుండి కృష్ణపట్నం పోర్ట్ సౌత్ గేట్ 6 లేన్ల రహదారి 36 కి.మీ రూ. 909 కోట్లు, తమ్మినపట్నం నుంచి నారికెళ్లపల్లెను కలుపుతూ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు 4 లేన్లు, పోర్ట్ రోడ్డు పొడిగింపు 6 లేన్ల రహదారి 16 కి.మీ రూ. 610 కోట్లు తో నేడు శంఖుస్థాపనలు చేయడం జరిగిందని అన్నారు. కృష్ణపట్నం పోర్టుకు వేగవంతమైన కనెక్టివిటీ కోసం నేషనల్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఔఎఅఆఅ) నేషనల్ మాస్టర్ ప్లాన్ నోడ్స్. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (అఃఎఅ) మరియు నెల్లూరు వద్ద ౹ఇజి పారిశ్రామిక నోడ్ల వల్ల అందుబాటులోకి రానున్నదని తెలిపారు. తిరుపతి ఇంటర్ మాడల్ సెంట్రల్ బస్ టర్మినల్ కు 2022 ఆగష్టు 18 లో ఎపిఎస్ ఆర్టిసి తో ఎం.ఓ.యు జరిగిందని టెండర్ ఈ జూలై లో పూర్తి కానున్నదని అన్నారు. దీనితో మంచి డిజైన్ తో నిర్మాణం జరగనున్నదని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హై వే నిర్మాణం పై దృష్టి పెట్టామని , ఎపి లో 7 గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని బెంగళూరు ? చెన్నై , బెతమంగల ? గుడిపాల , చిత్తూరు ? తచ్చురు ప్రధానంగా వున్నాయని ప్రస్తుత ప్రముఖ పట్టణాలు బెంగళూరు ? చెన్నై ప్రయాణ సమయం 6 నుండి 7 గంటలు వుందని గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హై వే పూర్తి అయితే 2.30 గంటల సమయం పడుతుందని తెలిపారు. దేశంలో కాశ్మీర్ ? కన్యాకుమారి వరకు సూరత్ ? చెన్నై , మనాలి , శ్రీనగర్ ?జమ్ము వంటి ప్రాజెక్టులు వివిధ దశల్లో వున్నాయని అన్నారు. అన్ని దక్షిణ ప్రాంత రాజధాని నగరాలను అనుసందానం చేయనున్నామని అన్నారు. బెంగళూరు ? విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హై వే ఎపి లో 5 జిల్లాల మీదుగా వెల్లనున్నదని తెలిపారు. అత్యధికంగా పారిశ్రామిక అభివృద్ధికి ఈ రహదారులు దోహదం కానున్నాయని అన్నారు. ఎపి లో పారిశ్రామిక అభివృద్ధికి అన్ని విధాల సౌకర్యం వుందని అన్నారు.

తిరుపతి పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రూ 17 వేల కోట్ల తో జాతీయ రహదారుల అభివృద్ధి చేయడం సంతోషమని , అడిగిన వెంటనే కాదనకుండా సహృదయంతో మంజూరు చేస్తారన్న కేంద్రమంత్రిగా మంచి పేరు వున్న వారని అన్నారు. గౌ. ముఖ్యమంత్రి ప్రతిపాదించిన పనులకు నేడు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అమృత హస్తాల మీదుగా రూ. 2900 కోట్లతో కృష్ణపట్నం పోర్ట్ అనుసందాన రహదారులకు శంఖు స్థాపన, తిరుపతి బస్ టర్మినల్ , మరికొన్ని రాష్ట్ర రహదారులు జాతీయ రహదారులుగా మార్పు కోరిన వాటిని సహృదయంతో స్వీకరించిన మంత్రి వర్యులకు ధన్యవాదాలని అన్నారు.

ఆర్ అండ్ బి కార్యదర్శి ప్రద్యుమ్న సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్రంలోని జాతీయ రహదారులు వాటి నిర్మాణాల వివిధ దశల ఫోటో ఎగ్జిబిషన్ కేంద్ర మంత్రికి వివరించి, స్వాగతోపన్యాసం లో వివరిస్తూ రాష్ట్ర అభివృద్ధి కి సహాయపడుతూ దేశంలో ఉత్తర ప్రదేశ్ తరువాత ఆంధ్రప్రదేశ్ కు అధిక నిధులు మంజూరు చేసారని రాష్ట్రం తరుపున ధన్యవాదాలని అన్నారు. మీరు మంజూరు చేసిన ప్రాజెక్టులను రాష్ట్ర మంత్రి సహకారంతో వేగవంతంగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జెసి డి కె బాలాజీ, ఎం ఎల్సి బల్లి కళ్యాణ చక్రవర్తి, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ రావు,తిరుపతి ఆర్డిఒ కనకనరసా రెడ్డి , ఎన్ హెచ్ ఏఐ అడ్వైజర్ /ప్లాంటేషన్ ఏకే జైన్, ఎన్హెచ్ పిడి వెంకటేశ్వర్లు, స్మార్ట్ సిటీ ఎం.డి. చంద్రమౌళి , జిల్లా అధికారులు , మహిళలు , స్థానికులు పేద ఎత్తున పాల్గొన్నారు.

# టీఎస్ పీఎస్సీ కేసులో రాజకీయ నేతలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులోమరో ఇద్దరు అరెస్ట్ అయ్యారు. కరీంనగర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ భర్త అయిన మద్దెల శ్రీనివాస్, అతని కూతురు మద్దెల సాహితీని జులై 12న సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. డీఈ పోల రమేశ్ డీల్ కుదుర్చుకుని సాహితి పరీక్షలు రాసినట్లు అధికారులు గుర్తించారు. విచారణలో ఈ విషయాన్ని తెలుసుకున్న అధికారులు రంగంలోకి దిగి వెంటనే వారిని అరెస్ట్ చేశారు.మరోవైపు, పేపర్ లీకేజీ కేసులో ౦-50 ముద్దాయిగా ఉన్న రమేష్ నుంచి ఏఈఈ ఎగ్జామ్ పేపర్‌ను కొనుగోలు చేసిన ఆరుగురిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వారి నుంచి రమేష్ అకౌంట్‌కి జరిగిన ఆన్‌లైన్ లావాదేవీల ఆధారంగా అధికారులు ఈ వ్యవహారాన్ని కూపీ లాగారు. ఇక బుధవారం జరిగిన మద్దెల శ్రీనివాస్, అతని కూతురు సాహితీ అరెస్ట్‌తో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 80కి చేరింది. ఈ వ్యవహారంలోమరిన్ని అరెస్టులుండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# మీడియాపై మోహన్ బాబు చిందులు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక మీడియా ప్రతినిధులు కొందరు కవరేజీ కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లారు. మీడియా ప్రతినిధుల కెమెరాలను చూడగానే మోహన్ బాబు చిందులు తొక్కారు.ఆ లోగోలు లాక్కొండయ్యా అంటూ తన బౌన్సర్లకు సూచించారు. మీడియా ప్రతినిధులకు బుద్ధి లేదా? అంటూ తన నోటికి పని చెప్పారు. సీనియర్ నటుడైన మోహన్ బాబు తాను కొనుగోలు చేసిన ఆస్తికి సంబంధించి రిజిస్ట్రేషన్ కోసం వచ్చినట్టు సమాచారం. అయితే ఈ వ్యవహారం మీడియా దృష్టి పడకుండా ఆయన వ్యవహరించడంతో అక్కడ ఉన్నవారు ఏం జరుగుతుందోనని చూస్తూ ఉండిపోయారు. మీడియాపై చిందులు తొక్కిన వ్యవహారం, బౌన్సర్లు అత్యుత్సాహం ప్రదర్శించిన తీరు రాద్ధాంతం అయింది.

## నాడు విద్యుత్ ఉద్యమంలో

# రైతులను చంపిన పాపం కేసీఆర్ దే

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రకటించిందని.. ఉచిత కరెంట్ ఇవ్వడం కుదరదని తెలుగుదేశంతో చెప్పించిన వ్యక్తి చంద్రశేఖర్ రావు అని చెప్పుకొచ్చారు. నాడు విద్యుత్ ఉద్యమంలో రైతులను చంపిన పాపం ముమ్మాటికీ కేసీఆర్ దే అంటూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ వస్తే వ్యవసాయంలో ఇద్దరం పోటీ పడదామన్నారు. "నేను వ్యవసాయం తెలిసిన వాడిని. దుక్కి దున్నిన వాడిని. కేటీఆర్ లాగా అమెరికాలో బాత్‌రూంలు కడగలేదు. నేను పాస్ పోర్ట్ బ్రోకర్ కొడుకుని కాదు. నేను దళారీ కొడుకును కాదు" అంటూ రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## ఏపీ విద్యార్థులకు తెలంగాణలో

# రిజర్వేషన్లు ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామారాపు రాజేశ్వర్‌రావుతో కూడిన హైకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఏపీ విభజన అనంతరం రెండు రాష్ట్రాల విద్యార్థులకు సమాన అవకాశాలను కల్పించేందుకు 15% సీట్లను రిజర్వు చేశారని, దానికి విరుద్ధంగా ఇప్పుడు 72 జీవో జారీ అయిందని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు.దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఆలిండియా కోటాలో 15% సీట్లు ఉన్నప్పుడు మిగిలిన సీట్లు తెలంగాణ విద్యార్థులకే చెందుతాయి కదా? అని ప్రశ్నించింది. అనంతరం తెలంగాణ ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదన వినిపిస్తూ.. రాష్ట్ర విభజన నాటికి ఉన్న సీట్లకే 15% రిజర్వేషన్లు పరిమితమని తెలిపారు. చట్టం అంతవరకే అనుమతి ఇచ్చిందని, ఆ సీట్లలో ఏపీ రాష్ట్ర విద్యార్థులు రిజర్వేషన్లు పొందుతున్నారని చెప్పారు. 2014 తర్వాత ఏర్పాటైన కాలేజీల్లో 15% సీట్లు ఆలిండియా కోటాలోకి పోయాక మిగిలిన సీట్లు తెలంగాణ విద్యార్థులకే చెందుతాయని, ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం 72 జీవో జారీచేసిందని వివరించారు. కొంత గడువిస్తే పూర్తి వివరాలతో సమగ్రంగా కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పడంతో అందుకు ధర్మాసనం అనుమతించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ లోగా అడ్మిషన్ల కోసం పిటిషనర్లు దరఖాస్తు చేసుకునేందుకు, రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు, కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అనుమతించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ అడ్మిషన్లు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది.

## ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలిగా

# దగ్గుబాటి పురందేశ్వరి

(మొదటిపేజీ తరువాయి)

దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ అవినీతికి దూరంగా ఉండే పార్టీ అని చెప్పారు. విభజన బిల్లులో ఉన్న విధంగా ఏపీలో జాతీయ విద్యాసంస్థలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికలకు ముందు రైతులకు రూ. 12 వేలు ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్రం నిధులతో కలిపే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇస్తుందని చెప్పారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే 22 లక్షల ఇళ్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కేంద్రం నిధులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను నిర్మించడం లేదని అన్నారు. రాష్ట్రంలో ఇళ్లకు సంబంధించి 35 శాతం కూడా పూర్తి కాలేదని విమర్శించారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజ్‌లో.. ప్రత్యేక హోదాలో జరిగే లబ్దిని పొందుపరచడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో కేంద్రం తప్పితే రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన రోడ్లు ఎక్కడ అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్ల దుస్థితి ఏమిటనేది ప్రజలను అడిగితే తెలుస్తుందని అన్నారు. ఏపీకి పరిశ్రమలు తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం లేదని అన్నారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు వెళ్లిపోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఏపీలో రివర్స్ టెండరింగ్‌తో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని విమర్శించారు. సీఎం సొంత బాబాయ్ హత్య కేసుని దర్యాప్తు చేయలేమని ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శలు గుప్పించారు. పోలవరం విషయంలో కేంద్రం ఎక్కడ జాప్యం చేయడం లేదని అన్నారు. పోలవరం నిర్మాణం చేయలేకపోతే కేంద్రానికి అప్పగించాలని అన్నారు. దశల వారీగా మద్యపాన నిషేధం హామీ ఏమైందని జగన్ సర్కార్‌ను ప్రశ్నించారు. నాణ్యత లేని మద్యంతో మహిళల పుస్తెలు తెగుతున్నాయని అన్నారు. సుపరిపాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ప్రైవేట్ మైనింగ్ కార్యకర్తల సహకారంతో రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. పొత్తులు అనేది అధిష్టానం చూసుకుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. జనసేన తమ మిత్రపక్షమేనని స్పష్టం చేశారు. జనసేనతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు. పవన్ నిన్న ఉన్నాం.. మొన్న ఉన్నాం.. రేపు ఉంటామని చెప్పారు.

## ఓసంపాదకీయం

# సెకండ్ సూపర్ ఎకానమీగా భారత్

మరికొన్నేళ్లలో, సెకండ్ సూపర్ ఎకానమీగా ఇండియా ఎదుగుతుందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. జపాన్, జర్మనీనే కాదు, అమెరికాను కూడా దాటేసి ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందంటూ ఒక రిపోర్ట్ రిలీజ్ చేసింది. ప్రస్తుతం, 3,750 బిలియన్ డాలర్ల జీడీపీతో భారతదేశం ప్రపంచంలో 5వ అతి పెద్ద ఎకానమీగా ఉంది. ఫస్ట్ ప్లేస్‌లో అమెరికా (26,854 బిలియన్ డాలర్లు), సెకండ్ ర్యాంక్‌లో చైనా (19,374 బిలియన్ డాలర్లు), మూడో స్థానంలో జపాన్ (4,410 బిలియన్ డాలర్లు), ఫోర్త్ ప్లేస్‌లో జర్మనీ (4,309 బిలియన్ డాలర్లు) ఉన్నాయి. ఇండియా తర్వాత... ఆరో స్థానంలో బ్రిటన్ (3,159 బిలియన్ డాలర్లు), సెవెన్త్ ప్లేస్‌లో ఫ్రాన్స్ (2,924 బిలియన్ డాలర్లు), ఎయిత్ ర్యాంక్‌లో ఇటలీ (2,170 బిలియన్ డాలర్లు), 9వ స్థానంలో కెనడా (2,090 బిలియన్ డాలర్లు), పదో స్థానంలో బ్రెజిల్ (2,080 బిలియన్ డాలర్లు) ఉన్నాయి. జీడీపీ పరంగా చూస్తే, ప్రస్తుతం, అమెరికా–భారత్ మధ్య బోలెడంత గ్యాప్ ఉంది. అయితే, 2075 నాటికి (మరో 50 ఏళ్లలో) ఈ గ్యాప్ ఫిల్ కావడమే కాదు, అమెరికా కంటే ఇంకా ఎత్తుకు ఇండియా చేరుకుంటుందని గోల్డ్‌మన్ సాక్స్ రిపోర్ట్ చేసింది. 140 కోట్లు దాటిన జనాభా భారత్‌కు అతి పెద్ద ఆస్తిగా గోల్డ్‌మన్ సాక్స్ చెబుతోంది. దీంతోపాటు, సరికొత్త ఇన్నోవేషన్స్ ఢ టెక్నాలజీ, అధిక మూలధన పెట్టుబడులు, వర్కర్ ప్రొడక్టివిటీ పెరగడం వంటివాటిని తన అంచనాకు ఆధారాలుగా ఈ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ చూపుతోంది."రాబోయే 20 ఏళ్లలో, ఇతర దేశాలతో పోలిస్తే, భారతదేశ డిపెండెన్సీ రేషియో చాలా తక్కువగా ఉంటుంది" అని రిపోర్ట్‌లో వెల్లడించింది. అంటే, ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. మేక్ ఇన్ ఇండియా, లోకల్ టు గ్లోబల్, ఆత్మనిర్భర్ భారత్ లాంటి పథకాలను దృష్టిలో పెట్టుకుని గోల్డ్‌మన్ సాచ్స్ ఈ కామెంట్స్ చేసిందిపడిపోతున్న డిపెండెన్సీ రేషియోలు, పెరుగుతున్న ఆదాయాలు, ఆర్థిక రంగంలో బలమైన అభివృద్ధి కారణంగా భారతదేశ సేవింగ్స్ రేట్ పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా, మరిన్ని మూలధన పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని క్లారిటీ ఇచ్చింది. రోడ్లు, రైల్వేల ఏర్పాటులో మౌలిక సదుపాయాల కల్పనకు భారత ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రిపోర్ట్‌లో వెల్లడైంది. మరిన్ని ఉద్యోగాలు సృష్టించి దేశంలో అతి భారీ సంఖ్యలో ఉన్న లేబర్ ఫోర్స్‌ను వర్క్‌లోకి తీసుకోవడం ద్వారా, మాన్యుఫాక్చరింగ్ ఢ సర్వీసెస్ కెపాసిటీలను పెంచుకోవడానికి ప్రైవేట్ రంగానికి ఇదే సరైన సమయం అని గోల్డ్‌మన్ సాచ్స్ చెబుతోంది.సూపర్ ఎకానమీగా ఇండియా ఎదగాలంటే కొన్ని రిస్క్‌లను తట్టుకుని ముందుకెళ్లాలి. వాటిలో ప్రధానమైంది లేబర్ ఫోర్స్. ఇండియన్ ఎకానమీలో లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ పెరగకపోతే ఆర్థిక వృద్ధి రిస్క్‌లో పడుతుందని తన రిపోర్ట్‌లో గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరించింది. "భారత్‌లో శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు గత 15 సంవత్సరాలుగా తగ్గింది" అని రిపోర్ట్‌లో వెల్లడించింది. రిపోర్ట్‌లో అండర్‌లైన్ చేసిన మరో పాయింట్.. "లేబర్ ఫోర్స్‌లో మహిళల భాగస్వామ్య రేటు పురుషుల కంటే చాలా తక్కువగా ఉంది"దీనిని బట్టి, పెరుగుతున్న జనాభా భారత్‌కు అతి పెద్ద ఆస్తి. దానిని సరిగ్గా ఉపయోగించుకుంటే భారత్ వెలిగిపోతుంది. జనాభాను ఉపయోగించుకోలేకపోతే, నిరుద్యోగం పెరిగి, ఎకానమీ దిగజారిపోయే ప్రమాదం కూడా ఉంది.

# ఆగస్టు నుంచి యంత్రాంగమంతా ఇక్కడే

హైదరాబాద్– ప్రభాత సూర్యుడు

తెలంగాణ బీజేపీ వ్యూహాత్మకంగా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకుంది. రాష్ట్ర అధ్యక్షుడి మార్పు, పార్టీలో కొత్తగా కొంత మందికి పదవులు ఇచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో యాక్టివ్ అయ్యేందుకు కార్యాచరణ రెడీ చేసుకుంది. బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ అనేలా ఉన్న బీజేపీకి మునుపటి పరిస్థితులు తీసుకురావడానికి రెడీ అయ్యారు. ఇందు కోసం అగ్రనాయకత్వం కూడా రంగంలోకి దిగిందని చెబుతున్నారు. కేసీఆర్‌ను ఎట్టి పరిస్థితుల్లో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రానివ్వకూడదని రాష్ట్ర, కేంద్ర బీజేపీ నాయకత్వం చేయాల్సిన ప్రయత్నాలు చేస్తోంది. బీఆర్ఎస్–బీజేపీ మధ్య ఎలాంటి సత్సంబంధాలు లేని నిరూపించాలని అనుకుంటున్నారు. జనాల్లోకి మరింత దూసుకెళ్లి.. అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు వైఫల్యాలను ఎండగట్టాలని గట్టిగానే డిసైడ్ అయ్యారు. జూన్–15న ఖమ్మంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు మించి భారీ బహిరంగ సభ నిర్వహించాలని భావించింది అధిష్ఠానం. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల సభ జరగలేదు.



జూలై–29న అదే ఖమ్మం గడ్డపై సభ నిర్వహించాలని ముహూర్తం ఫిక్స్ చేసింది. ఈ సభకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరవుతారు. ఆగస్ట్–15 తర్వాత తెలంగాణలో బీజేపీ పాలిత రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పర్యటించనున్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో 119 మంది ఎమ్మెల్యేలు పర్యటించబోతున్నట్లు రాష్ట్ర బీజేపీ ఓ ప్రకటనలో తెలిపింది. అయితే.. ఈ పర్యటన చాలా వ్యూహాత్మకంగా ఉంటుందని స్పష్టమవుతోంది. ఎందుకంటే.. బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేల ఆస్తుల వివరాలను ఆర్టీఐ ద్వారా సమాచారం సేకరించాలని బీజేపీ నిర్ణయించింది. ఆ డేటాతో నియోజకవర్గాల వారిగా ఎమ్మెల్యేలు పర్యటించినప్పుడు ఆయా బీఆర్ఎస్ నేత చిట్టా తీయబోతున్నారు కమలనాథులు. ఇలా వారి ఆస్తులు, అవినీతిని ప్రజల ముందు ఉంచితే ఎవర్ని నమ్మాలనేదానిపై ఓ నిర్ణయానికొస్తారని బీజేపీ నేతలు ఓ అభిప్రాయానికి వచ్చారు. అటు అమిత్ షా పర్యటన, ఇటు వరుసగా 119 మంది ఎమ్మెల్యేల పర్యటనతో పక్కా వ్యూహంతోనే అగ్రనాయకత్వం రాష్ట్రంలోకి అడుగుపెడుతోంది. బీజేపీ వచ్చే ముందు కేంద్ర దర్యాప్తు సంస్థలు వస్తాయన్న ఓ ప్రచారం ఉంది. ఇక్కడా అది జరుగుతుందని ఎవరూ ఊహించని విధంగా పరిణామాలు ఉంటాయని చెబుతున్నారు. అవి ప్రారంభమైన తర్వాత చేరికలు కూడా పెరుగుతాయని అంటున్నారు. పార్టీలో వలసలు ఉంటాయని జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు అసంతృప్త నేతలను బుజ్జగించేందుకు ఎమ్మెల్యే, ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ప్రయత్నిస్తున్నారు.

# ఓల్డ్ సిటీలో ఫోన్లు ఎత్తాలంటే భయం

హైదరాబాద్– ప్రభాత సూర్యుడు

ఫోన్ వస్తే చాలు.. అక్కడి ప్రజా ప్రతినిధులు హడలెత్తి పోతున్నారు. ఫోన్ రింగ్ టోన్ వారి గుండెల్లో.. భయం గంట మోగిస్తోంది. ఒక్కసారి ఫోన్ ఎత్తితే.. గంట తిరిగే సరికి సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతుంది. చేతిలో ఫోన్ ఉంది కదా అని ఎడా పెడా మాట్లాడి అడ్డంగా బుక్ అవుతున్నారు. ఆ కాల్ రికార్డింగ్లు బయటకు వచ్చి వారిని వ్యక్తిగతంగా వేధించడమే కాదు.. పదవులకే ఎసరు తీసు కువచ్చేలా ఉందంటూ లబోదిబోమంటున్నారు.. పలు వురు ప్రజాప్రతినిధులు.. ఈ పొలిటికల్ క్రైమ్ కథా చిత్రమ్ ఎక్కడిదో కాదు.. మన హైదరాబాద్ నగర కహానీనే.. హైదరాబాద్ ఓల్డ్ సిటీ.. మాస్ ఏరియా అడ్డా. టైంపాస్ బ్యాచ్ లతో చార్మినార్ గల్లీలన్నీ హౌస్ ఫుల్. రాత్రంతా పిచ్చాపాటి ముచ్చట్లే. ఖాళీ దొరికితే చాలు బాతాఖానితో కాలం వెళ్లదీస్తారు. ఇలాంటి కొన్ని బ్యాచ్లు.. హైప్రొఫైల్ క్యాండేట్ లను టార్గెట్ చేస్తున్నాయి. ఫోన్ చేసి మరి రికార్డింగ్.. ట్యాపింగ్ కు పాల్పడుతోంది. ఇలా ఓ గ్యాంగ్ వేళాపాళ లేకుండా ప్రజా ప్రతినిధులకు ఫోన్స్ చేసి



సమస్యలు విన్నవిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం, ప్రజలకు ఇచ్చిన హామీ ఏమైందని వేధిస్తోంది. వాళ్లు మాట్లాడిన మాటలను రికార్డ్ చేసిన అనంతరం సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేస్తోంది.ఇక ఆ ఆడియో చేసే రచ్చ అంతా ఇంతా కాదు. సీన్ రివర్స్ అయి.. సితార్ అవుతోందని ప్రజాప్రతినిధులు లబోదిబో మంటున్నారు.. అలా బయటికి వచ్చిన ఆ ఆడియో విన్న నెటిజన్లు సెటైర్లతో కామెంట్ బాక్స్ ను తెగ నింపేస్తున్నారు. దీంతో నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వెళుతుంది. ఫోన్ చేస్తే కొప్పడుతారన్న చెడ్డ పేరు కూడా పెద్ద లీడర్లకు వెంటాడుతోంది. ఈ ఎఫెక్ట్ ఎన్నికల సర్వేలో అటో.. ఇటో.. అని తేలుతుందని నెత్తిబాదు కుంటున్నారు. ఈ ఫీడ్ బ్యాక్.. ఫలానా ప్రజాప్రతినిధి గురించి ప్రజలు ఇలా మాట్లాడుకుంటున్నారంటూ హైకమాండ్ కు వెళ్తుందని.. దీంతో వచ్చే ఎన్నికల్లో సీటు ఇవ్వాలా..? వద్దా..? అన్న ఆలోచనలో పార్టీ పెద్దలు ఉండే అవకాశం ఉందని నాయకులు తెగ మదనపడుతున్నారు.. అయితే, కొంత మంది చేసే కాల్స్ తమ నెత్తిమీదకు తీసుకువస్తాయని చివర వరకు వాళ్లు కూడా ఊహించలేకపోతున్నామని.. అందుకే ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని నాయకులు బాహాటంగా మొత్తుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. పేరు మోసిన లీడర్లు.. కొత్త కొత్త ఫోన్ నెంబర్లతో ఫోన్ వస్తే.. ఫోన్ ఎత్తడానికి వంద సార్లు ఆలోచిస్తున్నట్లు సమాచారం.. ఇలాంటి ఫేక్ కాల్స్ పై గతంలో చాలా మంది ఫిర్యాదు చేశారు. దీంతో పలువురిపై కేసులు సైతం నమోదయ్యాయి. అయితే, ఇప్పుడు మళ్లీ ఇప్పుడు స్టార్ట్ అవ్వడంతో.. పొలిటికల్ కెరీర్ కు ఎక్కడ స్టాప్ పడుతుందోనని.. మదనపడుతున్నారు.. ఏదిఏమైనా.. ఈ నయా.. ఫోన్ పొలిటికల్ క్రైమ్ కథా చిత్రమ్.. ఇప్పుడు పాతబస్తీలో తెగ హాట్ టాపిక్ గా మారింది.

# ఆగస్టు 25న నల్లపోచమ్మ మసీదు, చర్చి ప్రారంభం

హైదరాబాద్– ప్రభాత సూర్యుడు

సర్వ మత సమానత్వాన్ని కొనసాగిస్తూ.. రాజ్యాంగం అందించిన లౌకికవాద స్ఫూర్తి ప్రతిఫలించే విధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. డా.బీ.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్మాణం పూర్తి చేసుకున్న నల్ల పోచమ్మ దేవాలయం, మసీదు, చర్చిని ఒకే రోజున ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్ సిద్ధమయ్యారు. ఈ మేరకు ఆయా మత పెద్దలను సంప్రదించి అందరికీ ఆమోదయోగ్యమైన తేదీని ఖరారు చేశారు. ఆగస్టు 25వ తేదీన హిందూ సాంప్రదాయాలను అనుసరించి పూజారుల సమక్షంలో నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేసి దేవాలయాన్ని సీఎం పునః ప్రారంభిస్తారు. అదే రోజున ఇస్లాం, క్రిస్టియన్ మతాల సాంప్రదాయాలను అనుసరించి ఆయా మత పెద్దల ఆధ్వర్యంలో మసీదును, చర్చిని సీఎం ప్రారంభిస్తారు. ఈ మేరకు మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎంఓ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల పెద్దలతో సంప్రదించి ఒకే రోజున మూడు మతాల ప్రార్థనా మందిరాలను ప్రారంభించే చారిత్రక నిర్ణయాన్ని సీఎం తీసుకున్నారని అధికారులు వెల్లడించారు. తద్వారా సచివాలయ ఉద్యోగులకు ఈ మూడు ప్రార్థనా మందిరాలు అందుబాటులోకి రానున్నాయి.కొత్త సచివాలయ సముదాయాన్ని ఏప్రిల్ 30న సీఎం కేసీఆర్ ప్రారంభించారు. వివిధ యుగాలలో నిర్మించిన బహుళ భవనాల సముదాయమైన పాత సచివాలయం సరిపోవని, వెంటిలేషన్ కూడా సరిగ్గా లేదని దాన్ని తొలగించింది. అలాగే ఏవైనా అగ్నిప్రమాదాలు జరిగినా బయటకు రాలేని పరిస్థితి అక్కడ ఉందంటూ దాన్ని కూల్చివేశారు. ఈ భవనాలలో వాస్తు పాటించకపోవడం మరొక కారణం. పాత సచివాలయం వద్ద ఉన్న నల్ల పోచమ్మ దేవాలయం, మసీదు ఇతర భవనాలు కూడా ఉన్నాయి. అయితే సచివాలయ భవనాన్ని కూలగొట్టే సమయంలో శిథిలాలు పడటం వల్ల మతపరమైన కట్టడాలు దెబ్బతిన్నాయని సీఎం విచారం వ్యక్తం చేశారు. మరోవైపు ఇతర మతాల ప్రజలు విపరీతమైన విమర్శలు చేశారు. మళ్లీ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈక్రమంలోనే ఇతర భవనాల కూల్చివేత సమయంలో పాడైన నల్లపోచమ్మ, చర్చి, మసీదును నిర్మించారు. వాటిని ఆగస్టు 25వ తేదీన ప్రారంభించబోతున్నారు.

# 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆరా... కేటీఆరా..?

హైదరాబాద్– ప్రభాత సూర్యుడు

అన్నీ అనుకున్నట్లుగా జరిగి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే ముఖ్యమంత్రి అయ్యేది ఎవరు? కేసీఆరా?.. కేటీఆరా?.. ఈ చర్చ గత కొంతకాలంగా జరుగుతున్నది. ముచ్చటగా మూడోసారి సీఎం అయ్యేది కేసీఆరేనని స్వయంగా కేటీఆర్ వ్యాఖ్యానించారు. కానీ, కేసీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన ఐదారు నెలలు మాత్రమే కంటిన్యూ అవుతారనే టాక్ ఆ పార్టీ నేతల్లో వినిపిస్తున్నది. లోక్‌సభ ఎన్నికలకు ముందో లేక తర్వాతో కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాష్ట్ర బాధ్యతలను కేటీఆర్‌కు అప్పగిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.కేసీఆర్ ఇమేజ్‌తోనే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లి గెలవాలన్నది బీఆర్ఎస్ వ్యూహం. గెలిచిన తర్వాత సీఎం ఎవరవుతారన్నది ఆ పార్టీకి మాత్రమే సంబంధించిన వ్యవహారం. ఎన్నికలకు ముందే కేటీఆర్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని బీఆర్ఎస్ భావించడం లేదు. అలాంటి ప్రకటన చేస్తే అది దుస్సాహసమే అవుతుందని ఆ పార్టీకి తెలుసు. అందుకే బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం...సౌత్ ఇండియాలోనే థర్డ్ టైమ్ సీఎం అయిన రికార్డు కేసీఆర్‌కే సొంతం అని కేటీఆర్ పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. కానీ అసెంబ్లీ ఎన్నికలు అయిపోగానే జరిగే లోక్‌సభ ఎన్నికలపై కేసీఆర్ స్పెషల్ ఫోకస్ పెట్టనున్నారు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అందులో చేరే అవకాశాలున్నట్లు ఇప్పటికే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జాతీయ రాజకీయాల్లో యాక్టివ్ రోల్ పోషించాలన్నది కేసీఆర్ ఆలోచన. అందుకే అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్‌కు సమదూరం పాటిస్తూ పక్కా వ్యూహంతో గులాబీ బాస్ అడుగులేస్తున్నారు.రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి రాగానే వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టును క్రియేట్ చేసి కేటీఆర్‌కు ఆ బాధ్యతలను కేసీఆర్ అప్పగించారు. పార్టీకి అధ్యక్షుడు కేసీఆరే అయినా బీఆర్ఎస్‌గా పేరు మార్చిన తర్వాత రాష్ట్రంలో పార్టీకి సంబంధించిన మొత్తం వ్యవహారాలను కేటీఆరే చక్కదిద్దుతున్నారు. మరోవైపు పాలనా వ్యవహారాల్లోనూ చురుగ్గా ఉన్నారు. డీఫ్యాక్టో సీఎంగా వ్యవహరిస్తున్నారనే ముద్ర ఆయనపై ఉండనే ఉన్నది. అనేక శాఖలకు సంబంధించిన సమీక్షా సమావేశాల్లోనూ పాల్గొంటున్నారు.ఇటీవల జిల్లాల పర్యటన సందర్భంగా అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులను కూడా కేటీఆరే ప్రకటిస్తున్నారు. సీఎం తరహాలోనే ఢిల్లీకి స్పెషల్ ఫ్లైట్‌లలో వెళ్తున్నారు. రాష్ట్ర పర్యటనల్లో హెలికాప్టర్లను విస్తృతంగా వినియోగిస్తున్నారు. కేసీఆర్‌ను కలవడానికి ఎమ్మెల్యేలకు తగిన అవకాశాలు లేకపోవడంతో వారు కేటీఆర్‌ను కలిసి



పనులు చక్కదిద్దుకుంటున్నారు. ఆయనకు దగ్గరైతే పార్టీలో పదవులు, స్థానం, టికెట్ ఖాయమనే భావన లీడర్లలో నెలకొన్నది. కేసీఆర్ తర్వాత ఎవరు అని పార్టీ నేతలను ప్రశ్నిస్తే వెంటనే కేటీఆర్ అనే సమాధానమే వినిపిస్తున్నది. పార్టీలో ట్రబుల్ షూటర్‌గా హరీశ్‌రావుకు గుర్తింపు ఉన్నా నిర్వహణ విషయంలో మాత్రం కేసీఆర్ తర్వాత కేటీఆర్ అనేది స్థిరపడింది. తాజాగా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఇద్దరు సొంత పార్టీ నేతల మధ్య విభేదాల పరిష్కారంలో భాగంగా తాటికొండ రాజయ్యను ప్రగతి భవన్‌కు రావాల్సిందిగా ఆదేశించింది కూడా కేటీఆరే. దేశానికి కేసీఆర్.. రాష్ట్రానికి కేటీఆర్ అనేది ఎస్టాబ్లిష్ అయింది.ప్రాంతీయ పార్టీగా దాదాపు ఇరవై ఏండ్లకు పైగా కొనసాగిన టీఆర్ఎస్ గతేదాది దసరా నుంచి బీఆర్ఎస్‌గా మారింది. జాతీయ రాజకీయాల్లో యాక్టివ్ అయ్యి నేషనల్ పార్టీగా గుర్తింపు పొందాలన్నది ఆ పార్టీ టాస్క్. కేంద్రంలో చక్రం తిప్పే స్థాయికి ఎదగాలన్నది దీర్ఘకాలిక వ్యూహం. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగానే నాన్-బీజేపీ, నాన్-కాంగ్రెస్ ఫ్రంట్ పేరుతో పలు ప్రాంతీయ పార్టీలతో కేసీఆర్ సంప్రదింపులు జరిపారు. కానీ అది అనుకున్న తీరులో సక్సెస్ కాలేదు. బీఆర్ఎస్ పేరుతో ఒంటరిగానే వెళ్లేలా ఇతర రాష్ట్రాల్లోకి ఎంట్రీ అవుతున్నారు. మహారాష్ట్రలో పదులాది మందిని చేర్చుకుంటూ జిల్లా కేంద్రాల్లో పార్టీ ఆఫీసులను ఓపెన్ చేస్తున్నారు. పార్టీ బలపడే యాక్షన్ ప్లాన్‌తో బహిరంగసభలను నిర్వహిస్తున్నారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ స్లోగన్‌తో తనదైన శైలిలో ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ ఎంట్రీకి ప్లాన్ చేస్తున్నారు. ఎంపీ సీట్ల సంఖ్యను పెంచుకోవడంపై దృష్టి పెట్టారు. ఒక పొలిటికల్ ప్రెషర్ గ్రూపుగా ఎస్టాబ్లిష్ కావాలని గులాబీ బాస్ భావిస్తున్నారు. కేంద్రంలో ఏర్పడేది సంకీర్ణ ప్రభుత్వమేననే భావనతో ఏ కూటమి అధికారంలోకి వచ్చినా అందులో చేరడానికి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు.అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్‌తో సమదూరం పాటిస్తున్నట్టు పైకి కనిపిస్తున్నా ప్రధాని మోదీతో కేసీఆర్ ఇప్పటికే రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవిత పేరు తెరపైకి రావడం, మూడుసార్లు ఈడీ విచారించడంతో దర్యాప్తు సంస్థలను బీజేపీ ఉసిగొల్పుతున్నదంటూ కేసీఆర్ ఫైర్ అయ్యారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నదంటూ బహిరంగంగానే విమర్శించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి కాంగ్రెస్‌పైకి బాణం ఎక్కుపెట్టారు. కేంద్ర ప్రభుత్వంతో తమకు సంబంధమే లేదంటూ స్టేట్‌మెంట్స్ ఇచ్చినా జూన్ చివరి వారంలో కేటీఆర్ ఢిల్లీ వెళ్లి పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఇవి బీజేపీకి దగ్గరయ్యే పొలిటికల్ మీటింగులనే ఊహాగానాలు వచ్చాయి. ఈ సమయంలోనే బీజేపీకి బీ–టీమ్ బీఆర్ఎస్ అని రాహుల్‌గాంధీ కామెంట్ చేశారు.పదేండ్లుగా కేంద్రంలో అధికారానికి దూరమైన కాంగ్రెస్ ఈసారి ఎలాగైనా గద్దెనెక్కేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. అందులో భాగంగానే భారత్ జోడో యాత్ర చేపట్టింది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పవర్‌లోకి రావడంతో ఆశలు చిగురించాయి. తదుపరి జాబితాలో తెలంగాణ చేరింది. ఎలాగూ రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో తిరిగి పవర్‌లోకి వస్తామన్న నమ్మకం ఆ పార్టీలో ఉన్నది. ఈ ప్రభావంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈసారి సీట్లు పెరుగుతాయని ఆశలు పెట్టుకున్నది.తగిన సంఖ్యా బలం లేకుంటే యూపీఏ కూటమిలో లేని ప్రాంతీయ పార్టీల సహకారాన్ని కోరే ఆలోచనా లేకపోలేదు. బీజేపీకి బీఆర్ఎస్ బీ–టీమ్ అంటూ ఇప్పుడు ఆరోపిస్తున్నా, గులాబీ పార్టీతో పొత్తు ఉండదని రాహుల్ తెగేసి చెప్పినా భవిష్యత్తులో మద్దతు కోరే అవకాశాలూ ఉన్నాయి. సరిగ్గా అలాంటి ఆప్షన్‌తోనే అఖిలేశ్ ద్వారా కేసీఆర్ తన వంతు ప్రయత్నాలు స్టార్ట్ చేశారు. యూపీఏ అయినా, ఎన్డీఏ అయినా సంకీర్ణ సర్కార్‌లో బీఆర్ఎస్ చేరిక అనివార్యమయ్యేలా కేసీఆర్ పావులు కదుపుతున్నారు.పాలిటిక్స్‌లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్న ఫిలాసఫీకి తగినట్లుగా బీఆర్ఎస్ దూరదృష్టితో అడుగులేస్తున్నది. జాతీయ స్థాయిలో చక్రం తిప్పే చాణక్య వ్యూహంతో కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. కేంద్రంలో కేసీఆర్.. రాష్ట్రంలో కేటీఆర్ ఫార్ములా వర్కౌట్ కావాలన్నది ఆ పార్టీ వ్యూహం. నౌ ఆర్ నెవర్ తరహాలో ఇప్పుడు కాకపోతే ఇక కేటీఆర్ సీఎం అయ్యేదెప్పుడు అనే చర్చలకు ఈ ఏడాది చివర్లోనే ఫుల్‌స్టాప్ పడనున్నది. కేసీఆర్ ఫొటోతోనే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లినా కాబోయే సీఎం ఎవరనేది కాలం తేల్చనున్నది.

# కాళ్లకల్‌లో కూల్చివేతలు..ఉద్రిక్తత



మెదక్– ప్రభాతసూర్యుడు : మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్ళకల్ లో ఉద్రిక్తత నెలకొంది. హెచ్ఎండీయే అనుమతులు లేని భవనాలను అధికారులు కూల్చివేసారు. అధికారులు భవన యజమానులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. దాంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల పహారాలో కూల్చివేతలు కొనసాగాయి.

## వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

భద్రాద్రి కొత్తగూడెం– ప్రభాతసూర్యుడు : వర్షం కారణంగా సింగరేణి ఓపెన్ కాస్ట్ గనులలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా సింగరేణి ఓపెన్ కాస్ట్ గనులలో సుమారుగా 32,000 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. కొత్తగూడెం జికె ఓసిలో 1000 టన్నుల బొగ్గు ఉత్పత్తి కి అంతరాయం, సత్తుపల్లి జెవిఆర్ లో 23 వేల టన్నులు, ఇల్లందు, కోయగూడెం ఓసిలో 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి కి అంతరాయం కలిగింది. అయితే, మణుగూరు ఓసిలో పనులు యధావిధిగా కొనసాగుతున్నాయి.

## విద్యార్థినీ, విద్యార్థులకు కథల పోటీలు

కోరుట్ల – ప్రభాతసూర్యుడు : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, కరీంనగర్ జిల్లా విభాగం వారిచే జగిత్యాల జిల్లా లోని కోరుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలబాలికల, కల్లూర్ రోడ్ లో ఈనెల 15వ తేదీన శనివారం ఉదయం 9:30 గం. నుండి కథ చెబుతారా? ఊ కొడతాం! అనే పేరుతో కథల పోటీ (స్టోరీ టెల్లింగ్ కాంపిటీషన్) నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఆర్ క్రిష్ణమూర్తి, జగిత్యాల జిల్లా కన్వీనర్ మంచాల జగన్ లు తెలిపారు.. బాల బాలికలలో సృజనాత్మక ను అద్భుతమైన ఆలోచనలను అవగాహనను పెంపొందించడంలో కథలదే ప్రాధాన పాత్ర ఏడు చేపల కథ నాన్న పులి కథ ఒకనాటి బాల్యం గడిచేది కాదనీ అదే లక్ష్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ వారు విద్యార్థిని విద్యార్థులకు కథ చెబుతారా? ఊ కొడతాం అనే అంశం మీద కథల పోటీలి నిర్వహిస్తున్నదనీ 10 సంవత్సరాల లోపు వారికి ఒక విభాగంగా 10 నుండి 15 సంవత్సరాల వారికి మరొక విభాగంగా పోటీలు నిర్వహిస్తామనీ ఒక్కొక్కరికి ఐదు నిమిషాల సమయం ఇస్తారనీ మంచాల జగన్ తెలిపారు.. ఈ పోటీలలో విద్యార్థిని, విద్యార్థులు అందరూ పాల్గొనాలనీ గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి 1,000 రూపాయలు ,రెండవ బహుమతి 750 రూపాయలు, తృతీయ బహుమతి 500 రూపాయలు, నగదుతో పాటు టిటిడి పక్షాన ప్రశంసాపత్రం కూడా బహూకరిస్తామని వారు తెలిపారు వివరాలకు ఫోన్ నెంబర్ 7396950725 లేదా 9885176157 లో సంప్రదించవచ్చని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలలో చదువుతున్న వారు పాల్గొనవచ్చునని వారు తెలిపారు.

## ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

మహబూబాబాద్– ప్రభాతసూర్యుడు : మహబూబాబాద్ జిల్లా కురివి మండలంలో రెండో రోజు ఎమ్మెల్యే రెడ్యానాయక్ కు నిరసన సెగ తగిలింది. మొగిలిచర్ల లో పర్యటించేందుకు బయలుదేరిన ఎమ్మెల్యేను గ్రామస్థులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఎమ్మెల్యేగా తమ గ్రామానికి ఏం చేశావంటూ నిలదీస్తూ నిరసనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించి చెదరగొట్టారు.

## జనగామలో విద్యార్థులు మిస్సింగ్

కరీంనగర్ – ప్రభాతసూర్యుడు : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పడమటి కేశవపురంలోని జాక్సన్ మిషనరీ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు అదృశ్యమవ్వడం కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే అశోక్(10), రమేష్ (12), ఎర్నిత్ (13) అనే ముగ్గురు విద్యార్థులు ఆ పాఠశాలలో చదువుకుంటూ హాస్టల్‌లో ఉంటున్నారు. అయితే బుధవారం సాయంత్రం ఈ ముగ్గురు విద్యార్థులు రహస్యంగా హాస్టల్ నుంచి పారి పో యారు. దీంతో హాస్టల్ సిబ్బంది ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమా చారం అందించారు. దీంతో ఆ విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి కేసు నమోదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు అదృశ్యమైన విద్యార్థుల కోసం గాలిస్తున్నారు. అయితే ఆ విద్యార్థులు హాస్టల్ నుంచి ఎందుకు పారిపోయారు.. ఏం జరిగింది అన్న విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు.

## తాలిపేరు ప్రాజెక్టుకు జల కళ

భద్రాద్రి కొత్తగూడెం– ప్రభాతసూర్యుడు : ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో సరిహద్దు ప్రాంతాల్లోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతుంది దీంతో ప్రాజెక్టుల సామర్థ్యానికి చేరుకోవడంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని మధ్యతరహా నీటి ప్రాజెక్టు అయిన తాలిపేరు ప్రాజెక్టుకు నిన్నటి నుండి వరద నీరు వచ్చి చేరుతుండడంతో అధికారులు ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి 2196 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువన ఉన్న చత్తీస్–ఘడ్ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతుంది దీంతో ఇన్ ఫ్లో 1244 క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 2196 క్యూసెక్కులు కొనసాగుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 730 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 71.95 మీటర్లకు చేరుకోవడంతో వరద నీటిని దిగువకు వదులుతున్నారు ఈ ఏడాది మొదటిసారి ఈ ప్రాజెక్టు నుండి వరద నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు.

# కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు

రాచకొండ కమిషనర్ డి.ఎస్. చౌహాన్






రంగారెడ్డి – ప్రభాతసూర్యుడు : ఓల్డ్ మల్కాజిగిరి మహంకాళి అమ్మవారి గుడి, సఫీల్ గూడ కట్టమైసమ్మ గుడిని రాచకొండ పోలీసు కమిషనర్ డిఎస్ చౌహాన్ గురువారం సందర్శించారు. బోనాల పండుగ సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అయన అధికారులను ఆదేశించారు. మల్కాజిగిరిలో ఆదివారం సోమవారం జరగబోయే బోనాల ఉత్సవాల సందర్భంగా ఓల్డ్ మల్కాజిగిరి మహంకాళి అమ్మవారి గుడి, సఫీల్ గూడ కట్టమైసమ్మ గుడిని సిపి చౌహన్ సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. బోనాల పండుగ సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సాధారణ భక్తులకు ఈసారి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు. మహిళా భక్తులు, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయడానికి తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. షీ టీం బృందాలు కూడా మహిళా భక్తుల రక్షణ కోసం విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. భక్తులు పోలీసు వారికి సహకరించాలని, సంతోషంగా బోనాల పండుగ జరుపుకోవాలని ఆకాక్షించారు. మల్కాజ్ గిరి డీసిపి డి.జానకి, మల్కాజిగిరి ఏసిపి నరేష్ రెడ్డి, కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి, నేరెడ్మెట్, మల్కాజిగిరి సిఐలు ఇతర అధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే ఆగం చేయవట్టే


- రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు ఉరి తీసి దగ్ధం చేసిన బిఆర్ఎస్ నాయకులు
- కాంగ్రెస్ సర్కార్‌తో రైతులకు కష్టాలు తప్పవు
- రేవంత్‌రెడ్డి మాటల్లోఆంతర్యంపై ఆలోచన చేయాలే
- మండల పార్టీ అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్



మంథని – ప్రభాత సూర్యుడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే రైతులను, ప్రజలను ఆగం చేసేలా ఆ పార్టీ నాయకులు ప్రవర్తిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ అన్నారు. వ్యవసాయానికి రైతులకు మూడు గంటల కరెంటు చాలన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను నిరసిస్తూ గురువారం మంథని మున్సిపల్ పరిధిలోని పవర్‌హౌజ్ కాలనీ సబ్ స్టేషన్ ముందు జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు ఉరి తీసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏగోలపు శంకర్ గౌడ్ మాట్లాడుతూ రైతులకు అన్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరి స్తోందని, అధికారంలోకి రాకముందే రైతులకు మూడు గంటలు చాలని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆనాడు కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు మేలు చేయలేదని, ఈనాడు అధికారం కోసం రైతుల ఉచిత 24గంటల కరెంటును వద్దంటున్నారని, ఇలాంటి నైజం కల్గిన కాంగ్రెసపార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని, రైతులను రాజుగా చేయాలన్న సంకల్పంతో అనేక పథకాలను అమలు చేస్తున్నారని ఆయన గుర్తుచేశారు. రైతులపట్ల చిన్నచూపు చూస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటల్లో ఆంతర్యం ఏమిటని ఆలోచన చేయాల్సిన అవసరం రైతులు, ప్రజలపైఉందన్నారు. కరెంటు కోసం సాగునీళ్ల కోసం ఇబ్బందులు పడ్డ రైతుల ముఖాల్లో ఆనందం చూడాలని 24గంటలు, వ్యవసాయానికి తగిన సాగునీరును బీఆర్ఎస్‌ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్నారని, ఏ పార్టీ నాయకులు ప్రజల, రైతుల మేలు కోరుతున్నారో అర్థం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, జెడ్పీటీసీ తగరం సుమలత శంకర్ లాల్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ ఎక్కటి అనంతరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షుడు కొట్టే రమేష్, ఎంపీటీపీ మిర్యాల ప్రసాదరావు, కౌన్సిలర్‌లు వీకే రవి, సీపతి బానయ్య, కుర్ర లింగయ్య, కాయితి సమ్మయ్య, గర్రెపల్లి సత్యనారాయణ, నాయకులు గుండా పాపారావు, మంథని లక్ష్మణ్, కడాల సంపత్, ఎరుకల రవి, ప్రబాకర్‌రెడ్డి, బడికెల సది, శంకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రూ.2 లక్షల విలువైన నోట్ పుస్తకాల పంపిణీ

### -80 పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందించిన శ్రీసీతారామ సేవాసదన్




మంథని – ప్రభాతసూర్యుడు: మంథని పట్టణానికి చెందిన శ్రీ సీతారామ సేవా సదన్ ఆధ్వర్యంలో మంథని,ముత్తారం, మలహర్, రామగిరి మండలాలలోని వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలోని 80 పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు 2 లక్షల రూపాయల విలువైన నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. మంథని మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో 6 నుండి 10 వ తరగతి వరకు చదువుచు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. శ్రీ గౌతమేశ్వర చారిటబుల్ ట్రస్ట్, మంథని వారిచే విద్యా దత్తత పథకం క్రింద ఆరుగురు పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం సైతం అందించారు. కీ.శే.రాధారపు గోవింద రావు, వారి సతీమణి జయప్రద ల స్మారకంగా మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మంథని జిల్లా పరిషత్ ఉన్నత (బాలికల) పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకములను అందించారు. ఈ కార్యక్రమానికి శ్రీ సీతారామ సేవ సదన్ అధ్యక్షులు కెవి ఎల్ ఎన్ హరిబాబు అధ్యక్షత వహించగా కార్యదర్శి దుద్దిల్ల గణపతి, కొల్లారం శ్రీనివాస్, పల్లి ప్రహ్లాద్, నల్లగొండ హరి , అష్టవదాని గంగాధర్, మహావాది మురళీధర్ , పి భూమయ్య , లోకే మనోహర్ రావు, టక్కోగారి రాధాకిషన్ రావు, చిల్లప్పగారి అనురాగ్, మంథని మండల విద్యాధికారి దాసరి లక్ష్మి తో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

# గోకుల్ చాట్ నిందితులకు 10 ఏళ్ల జైలు

హైదరాబాద్– ప్రభాతసూర్యుడు ఇండియన్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థకు చెందిన ఒబేద్ రెహ్మాన్, ఇమ్రాన్‌ఖాన్, ధనీష్ అన్సారీ, అఫ్తాబ్ అలంను వివిధ పేలుళ్ల కేసులో దోషులుగా తేల్చిన ఎన్ఐఏ కోర్టు శిక్షలను ఖారరు చేసింది.దేశవ్యాప్తంగా భారీ పేలుళ్లకు కుట్ర చేసిన నలుగురు ఇండియన్ ముజాహిద్దీన్ ఉగ్రవాదులకు శిక్ష పడింది. ఒక్కొక్కరికి పదేళ్ల శిక్ష వేస్తూ ఎన్ఐఏ కోర్టు తీర్పు ఇచ్చింది. వీళ్లకు లుంబినీపార్క్, గోకుల్ చాట్, దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసుతో సంబంధాలు ఉన్నాయి. ఇండియన్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థకు చెందిన ఒబేద్ రెహ్మాన్, ఇమ్రాన్‌ఖాన్, ధనీష్ అన్సారీ, అఫ్తాబ్ అలంను వివిధ పేలుళ్ల కేసులో దోషులుగా తేల్చిన ఎన్ఐఏ కోర్టు శిక్షలను ఖారరు చేసింది. ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష విధించింది. గతంలో వివిధ పేలుళ్ల కేసులతో సంబంధాలు ఉన్న వీళ్లు హైదరాబాద్, ఢిల్లీలో కూడా పేలుళ్లకు రెక్కీ నిర్వహించారు. దేశవ్యాప్తంగా పేలుళ్లు జరిపి భయభ్రాంతులు సృష్టించడంతోపాటు అలజడులు రేపాలని ఇండియన్ ముజాహిద్దీన్ ప్రయత్నించింది.

నిషేధ జాబితాలో ఉన్న ఈ సంస్థ తరఫున పని చేసే ఈ నలుగురు సానుభూతి పరులు వారికి దేశంలో పేలుళ్లకు కుట్రలో భాగమయ్యారు. హైదరాబాద్, బెంగళూరు పేలుళ్లలోనూ ఈ నలుగురిపాత్ర ఉన్నట్టు ఎన్ఐఏ రుజువు చేసింది. గోకుల్ చాట్, లుంబినీ పార్క్, దిల్‌సుఖ్‌నగర్ జంటపేలుళ్లతోనూ వీళ్లకు సంబంధాలు ఉన్నాయి. వారణాసి, ముంబై, ఫజియాబాద్, ఢిల్లీ పేలుళ్లలోనూ వీళ్ల పాత్ర ఉంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన విధ్వంసాల్లో ఈ నలుగురి పాత్ర ఉన్నట్టు ఎన్ఐఏ కోర్టులో వాదించింది. దానికి సరిపడా ఆధారాలను కూడా కోర్టుకు సమర్పించింది.

## విద్యార్థి మిస్సింగ్

రంగారెడ్డి – ప్రభాతసూర్యుడు : రాజేంద్రనగర్ బండ్లగూడ లో 12 సంవత్సరాల విద్యార్థి మిస్సింగ్ కలకలం రేపింది. బుధవారం రాత్రి చిట్టి డబ్బులు ఇవ్వడానికి బయటకు వెళ్లిన సాయి చరణ్, ఎంతకీ ఇంటికి తిరిగి రాలేదు. దాంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఎక్కడా లభించకపోవడంతో రాజేంద్రనగర్ పోలీసులను తల్లి ఆశ్రయించింది. పోలీసులు రాత్రంతా తీవ్రంగా గాలించారు. సిసి టీవీ ఫూటేజ్ ను పరిశీలించారు. కిడ్నాప్ కేసు నమోదు చేశారు.

## 24 గంటల విద్యుత్ పచ్చి అబద్ధం

యాదాద్రిభువనగిరి – ప్రభాతసూర్యుడు భువనగిరి లో ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసారు. గురువారం నాడు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ను అచప సందర్శించారు. అక్కడి ఎల్బీ రిజిస్టర్ ను తనిఖీ చేసారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ 24 గంటల కరెంటు అనేది పచ్చి అబద్ధం. 11 గంటల విద్యుత్ మాత్రమే ఇస్తున్నారు. అందులోనూ కోతలు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఉద్యోగులకు సరైన సమయంలో వేతనాలు ఇవ్వడం లేదు. ఉద్యోగులందరూ కష్టాల్లో ఉన్నారు. జీతాలు రాక ఈఎంఐలు కట్టక అప్పుల పాలు అవుతున్నారు ఉద్యోగస్తులు. 11 గంటలకంటే విద్యుత్ ఎక్కువ ఇచ్చినట్టు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం అని మంత్రి కేటీఆర్ కు సవాల్ విసిరారు

## తుపాకీ, కత్తులతో నృత్యాలు యువకుల హల్చల్

కామారెడ్డి – ప్రభాతసూర్యుడు మద్నూర్ మండల కేంద్రంలో ఓ వివాహ విందులో న్యూసెన్సు జరిగింది. తుపాకీ, కత్తులతో యువకులు నృత్యాలు చేస్తూ హల్చల్ చేసారు. పెళ్లి లోచేసిన డ్యాన్స్ తో. ఉలిక్కి పడ్డ స్థానికులు పోలీసులకు ఉప్పందించారు. విన్యాసాలు చేసిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సదరు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి కుడా. మద్నూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215